క్లుప్తంగా

మొక్కలు నాటడం బాధ్యత కావాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మొక్కలను నాటడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా సహకార ఆడిట్ అధికారి తిరుపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను మంగళవారం నాటారు. గోగుల శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని 17 / 3 ఆకుతోట సచివాలయం, 42వ డివిజన్లోని మన్సూర్‌నగర్‌లో పారిశుధ్య పనులను ఎంహెచ్‌ఓ చైతన్య మంగళవారం పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాల నిర్వహణను తనిఖీ చేశారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను పర్యవేక్షించారు.

అభివృద్ధి పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా గురుప్రసాద్



నెల్లూరు(అర్బన్): ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్న జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీలో సభ్యుడిగా సింహపురి వైద్యసేవా సమితి ట్రస్ట్ నుంచి మార్లెళ్ల గురుప్రసాద్‌ను మంగళవారం నియమించారు. ట్రస్ట్ తరఫున జయభారత్ హాస్పిటల్ జీఎంగా ఉన్నారు. ఈ క్రమంలో ఆయన్ను స్వచ్ఛంద సంస్థల తరఫున ఎంపీ నియమించారు.

జగన్‌ను కలిసిన నేతలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నెల్లూరు నేతలు మంగళవారం కలిశారు. పార్టీ యువజన విభాగ రాష్ట్ర సెక్రటరీ పాశం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్ కలిసి సత్కరించారు.

మధ్యాహ్న భోజన పథక అమలుపై తనిఖీ



కోవూరు: పట్టణంలోని పచ్చిపాల రామనాధమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సివిల్ సప్లయ్స్ డీఎం అర్జున్‌రావు ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని వివరించారు. భోజన ఏజెన్సీని అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సోఫియా కిరణ్మయి పాల్గొన్నారు.

'వాహనమిత్ర' అమలుకు డిమాండ్



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వాహనమిత్ర పథకాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆటో కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఆటో కార్మిక సంఘ జిల్లా మహాసభలకు హాజరైన ఆయన మాట్లాడారు. ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం సరికాదని చెప్పారు. తొలుత సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఆటోలతో ర్యాలీని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, మండల కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్పొరేషన్ కార్యాలయ ఎదుట ధర్నా

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్లోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయ ఎదుట మంగళవారం చేపట్టిన నిరసనలో శ్రీనివాసులు, ఇంజినీరింగ్ విభాగాధ్యక్ష, కార్యదర్శులు ముని మోహన్‌బాబు, మట్టిపాటి శ్రీనివాసులు మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలకు తక్కువ ఉండకూడదని వేతన సవరణ కమిషన్ నిర్ణయించిందని, అయితే నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగ కార్మికుల జీతం కేవలం రూ.13 వేలే ఉండటం బాధాకరమని చెప్పారు. సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం నిలిపేయడం దారుణమని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, సూర్యనారాయణ, ఇంజినీరింగ్ విభాగ యూనియన్ నేతలు శివ, బాబ్జీ, ప్రసాద్, శ్రీనివాసులు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

నార్తుమోపూరులో మాజీ ఎంపీ ఆదాల



నెల్లూరు సిటీ: అల్లూరు మండలంలోని తన స్వగ్రామం నార్తుమోపూరును మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. బంధువులు, స్నేహితులు, సన్నిహితులను ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాలను ఆరాతీశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్వర్ణా వెంకయ్య, హరిబాబుయాదవ్, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, వైవీ రెడ్డి, కొండేటి నరసింహరావు, అల్లాబక్షు, నానీ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని కమిటీ చైర్మన్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ అమరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సంస్థ డీజీఎం శ్రీనివాసరావు, ఐఎఫ్ఏ శ్రీనివాసరావు, ఏజీఎం శ్రీనివాసరావు, టీఏసీ సభ్యులు కటారి రమణయ్య, గుర్రం మాల్యాద్రి, ప్రసాద్, బ్రహ్మానందం, రమేష్‌బాబు, ముంగర గోపాల్, అనూష, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రబాబు సేవలు ఆదర్శనీయం



మాట్లాడుతున్న సూర్యనారాయణ

నెల్లూరు(బృందావనం): ఉద్యోగ సేవ కలిగిన చొప్పా రవీంద్రబాబు పనితీరు ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ కొనియాడారు. కలిగిరి తహసీల్దార్ రవీంద్రబాబు ఉద్యోగ విరమణను పురస్కరించుకొని వీడ్కోలు సభను నగరంలోని పురమందిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం రవీంద్రబాబు, కామేశ్వరి దంపతులను సన్మానించారు. విశ్రాంత తహసీల్దార్ జలకం మనోహర్‌బాబు, ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, వీఆర్వోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు, ఏనుగు రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఏపీ ఎన్జీఓల సంఘ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు పంటా అశోక్‌కుమార్‌రెడ్డి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్, జిల్లా సర్వే, ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ నాగశేఖర్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ చల్లా పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



నెల్లూరు(అర్బన్): పొగతోటలోని నెల్లూరు వాస్కులర్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి వాస్కులర్ అండ్ ఎండో వాస్కులర్ సర్జన్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. నెల్లూరులో పూర్తిస్థాయిలో క్లినిక్‌ను ప్రారంభించి ఏడాది పూర్తయిందని చెప్పారు. ఈ తరుణంలో వారం పాటు ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు వరకు ఓపీ సేవలను ఉచితంగా అందించనున్నామని పేర్కొన్నారు.

రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని మంగళవారం నిర్వహించారు. చైర్మన్‌గా ఖాదర్‌బాషా, 80 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ వీడ్కోలు సభ

నెల్లూరు సిటీ: పోలీస్ శాఖలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు సభను ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఏఎస్సైలు సత్యనారాయణరావు, మస్తాన్, అబ్రహాం, రాధాసింగ్, ఏఆర్ ఎస్సై రమణయ్య, హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, క్లాస్ – 4 ఉద్యోగి అంకమ్మ, హోంగార్డులు మోహన్‌రావు, రియాజ్ బాషాను సత్కరించారు. శేషజీవితాన్ని హాయిగా గడపాలని కాంక్షించారు. ఏఎస్పీ సౌజన్య, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఏఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

నెల్లూరు(బారకాసు): భవన అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గానూ నగరంలోని 17వ డివిజన్ చిల్డ్రన్స్ పార్కు రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న వివిధ భవనాల నిర్మాణాలను పరిశీలించి.. అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. అనంతరం రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఫిర్యాదును పరిష్కరించే నిమిత్తం 23వ డివిజన్లోని కల్లూరుపల్లి రోడ్డు బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో పర్యటించారు. భవనానికి సంబంధించిన కొలతలేయించి, అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు.

పెన్షనర్ల సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల భవనంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య, కార్యవర్గ సమావేశాన్ని గురువారం ఉదయం పదికి నిర్వహించనున్నామని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్వీఎస్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

ధర్మరాజస్వామికి పూజలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం తదితర పూజా కార్యక్రమాలను మంగళవారం జరిపారు. విశేష పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. భగవద్గీత పఠనం, మహాభారత పురాణ కాలక్షేపం, భీమబకాసురవధ ఉత్సవాన్ని జరిపారు. ద్రౌపదీదేవి అమ్మవారి కల్యాణాన్ని రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా దొంతంశెట్టి సమీర్, ప్రవీణ, కృష్ణ, రామచంద్రగుప్తా, దాక్షాయణి, చెంగల్‌పట్టు శ్రీధర్, ప్రసన్న, యశ్వంత్ ప్రణీత్‌రెడ్డి, లావణ్య, డాక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తదితరులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

ఇండోసోల్ కంపెనీతో ఒప్పంద రద్దుకు డిమాండ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి వారికి కేటాయించిన 8338 ఎకరాలను రైతులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు, నేతలపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల పేరుతో బలవంతంగా భూములను లాక్కుంటే అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

4 వరకు మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

నెల్లూరు సిటీ: మహిళా సాధికారత – గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు అనే అంశంపై మహిళా సర్పంచ్‌లకు డివిజన్ స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రూరల్, వెంకటాచలం, ముత్తుకూరు, రాపూరు, పొదలకూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు మండలాలకు చెందిన వారు హాజరుకావాలని కోరారు.

గోడను అక్రమంగా కట్టారని ఫిర్యాదు

నెల్లూరు సిటీ: తన పొలం ఎదుట గోడను ఓ వ్యక్తి అక్రమంగా కట్టారంటూ నెల్లూరు రూరల్ పోలీసులకు బాధితురాలు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. దొడ్ల డెయిరీ ఎదుట ఎకరాను శ్రీవాణి గతంలో కొనుగోలు చేశారు. పొలానికి వెళ్లే బాటలో గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ తరుణంలో పొలం గేట్ వద్ద గోడను ప్రసాద్ రెండు రోజుల క్రితం కట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ అరెస్ట్



నెల్లూరు సిటీ: ఇంటి తాళాలను పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేసిన దొంగను వేదాయపాళెం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. ఉమ్మారెడ్డిగుంటలోని ఓ ఇంట్లో బంగారు నగలు, వెండి పట్టీలను చోరీకి గురయ్యాయంటూ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణ జరిపారు. కొండాయపాళేనికి చెందిన గోపిశెట్టి సునీల్ చెడువ్యసనాలకు బానిసై చోరీ చేశారనే అంశాన్ని పోలీసులు గుర్తించారు. అతని నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కేసును ఛేదించిన పోలీసులను నగర డీఎస్పీ అభినందించారు.

వైద్యులకు ఘన సన్మానం



పొగతోటలో..



వెంకటేశ్వరపురంలో..

నెల్లూరు(అర్బన్): డాక్టర్స్ డేను నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను ఘనంగా సత్కరించారు.

➡ నగరంలోని పొగతోటలో వైద్యులు వసుమతి, ప్రేమ్‌దీప్, శ్వేత, వైష్ణవి, గోకుల్‌కృష్ణన్, రవికుమార్‌ను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీహెచ్‌పీ) ఆధ్వర్యంలో సన్మానించారు. రిచ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ తెనాలి రవికుమార్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శేషయ్య, నేతలు దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాసు, మాలిని, పెంచలయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని నారాయణ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ వైద్యులను సత్కరించారు. నారాయణ వైద్య, విద్యాసంస్థల కోఆర్డినేటర్ బిజు రవీంద్రన్, దంత కళాశాల ప్రిన్సిపల్ అజయ్ రెజినాల్డ్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ విశ్వకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో పీఎంపీలు ప్రసాద్, శివ, గౌస్‌ను దివ్యాంగుల ఐక్య సంఘ ఆధ్వర్యంలో సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, సమీవుల్లా, మస్తాన్, వేణు, జక్కావుల్లా తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత





నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తూ పందల సుబ్బరత్నమ్మ మృతి చెందడంతో కారుణ్య నియామకం ద్వారా కుమారుడు ఆనంద్ బాబును పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా విధులు కేటాయించారు. ఈ క్రమంలో నియామక ఉత్తర్వులను కమిషనర్ నందన్ తన చాంబర్‌లో మంగళవారం అందజేశారు. నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ సూపరింటెండెంట్ సులోచన పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్న గురవయ్య మరణించారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు గురుకిశోర్‌ను కారుణ్య నియామకంలో భాగంగా గ్రేడ్ – 2 వీఆర్వోగా నియమించారు. ఈ తరుణంలో నియామక పత్రాన్ని కలెక్టరేట్లో ఏఓ విజయ్‌కుమార్ అందజేశారు.

పార్కు ఆధునికీకరణ బాధ్యత కన్సల్టెన్సీకి..

నెల్లూరు సిటీ: నగరంలోని 17వ డివిజన్లో గల చిల్డ్రన్స్ పార్కు ఆధునికీకరణ బాధ్యతను కన్సల్టెన్సీకి అప్పగించనున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. పార్కును అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కన్సల్టెన్సీ, పార్కు కమిటీ, కార్పొరేషన్ అధికారుల ఏకాభిప్రాయంతో పనులను ప్రారంభించనున్నామని వెల్లడించారు. స్కేటింగ్ చేస్తున్న చిన్నారులతో ముచ్చటించారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

➡ ఖజానాలో నిధుల్లేకపోయినా, తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ డబ్బులను అందిస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. నగరంలోని 42వ డివిజన్ మన్సూర్‌నగర్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. కమిషనర్ నందన్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న వెంకట్రావ్‌యాదవ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభిస్తుందని పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్ పేర్కొన్నారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా ఎంపికైన ఆయన్ను పార్టీ నెల్లూరు రూరల్ కార్యాలయంలో పలువురు మంగళవారం సత్కరించారు. నేతలు అల్లావుద్దీన్, రెహమాన్, కొండా సంజయ్‌కుమార్, సుధీర్, మల్లికార్జునరెడ్డి, హనీఫ్, నరేష్, సుజాత, నూర్జహాన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే రేషన్ సరుకులివ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రేషన్ దుకాణాల ద్వారా సరుకులను ప్రస్తుతం పంపిణీ చేస్తుండటంతో దివ్యాంగులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా ఇంటి వద్దే అందజేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ పేర్కొన్నారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రేషన్ సరుకుల పంపిణీ వాహనాలను మూలనపడేశారని, దీంతో చాలా మంది ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, సీపీఐ నేతలు సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌తో తీరని అన్యాయం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్‌తో విద్యుత్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముజఫర్ అహ్మద్ ఆరోపించారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఎస్పీడీసీఎల్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె.. వచ్చే నెల ఎనిమిదిన జరపనున్న చలో విజయవాడ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. విద్యుత్ సంస్థలో వెట్టిచాకిరీ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, సుమన్, గోగుల మహేష్, శ్రీనివాసులు, ఈశ్వర్‌కుమార్, మహేంద్ర, మురళి, రామారావు, భాస్కర్, మనోహర్‌రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'భూ ఆక్రమణకు ఉదయగిరి ఎమ్మెల్యే యత్నం'

నెల్లూరు(బృందావనం): తమ భూమిని కాజేసేందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన సోదరుడు యత్నిస్తున్నారని, న్యాయం చేయాలని జలదంకి మండలంలోని గట్టుపల్లి చింతలపాళేనికి చెందిన గారపాటి సదాశివరావు కోరారు. పురమందిరంలోని రీడింగ్ రూమ్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. తాను, తండ్రి టీడీపీకి చెందిన వారిమని, ప్రస్తుతం ఏలూరులో ఉంటున్నామని చెప్పారు. చింతలపాళెంలోని 11 సర్వే నంబర్లలో 88 ఎకరాల్లో మామిడి తోటను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. కృష్ణా జిల్లాకు చెందిన తలసిల వెంకీనరసింహారావుతో ఆర్థిక లావాదేవీల్లో సమస్యలు తలెత్తాయని, దీంతో ఆయన రౌడీలతో దాడి చేయించారని చెప్పారు. మామిడి తోట విషయమై డీఎస్పీకి ఫిర్యాదు చేశామని, అయితే ఇది ఎమ్మెల్యేకు సంబంధించిన అంశమని చెప్పారన్నారు. ఎమ్మెల్యేను కలవగా, తన మనుషులతో విచారణ చేయిస్తామని తెలిపారని చెప్పారు. మామిడితోటలో రూ.36 లక్షల విలువైన కాయలను కోశారని, చివరిని తన భూమిని కాజేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.